సాక్షి విశాఖపట్నం

గురువారం । 14 । డిసెంబర్ । 2023



కాంతులీనిన పుష్కరిణి

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి బుధవారం పోలి పాడ్యమి శోభను సంతరించుకుంది. IIలో



కృష్ణకు సీపీ అభినందన

ఐరన్ మ్యాన్ పోటీల్లో పతకం సాధించిన కానిస్టేబుల్ పరవాడ కృష్ణను పోలీస్ కమిషనర్ రవిశంకర్ అభినందించారు. IIలో



కిరండూల్‌కు మరో విస్టాడోమ్ కోచ్

అరకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం కిరండూల్ స్పెషల్‌కు మరో విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నారు. IIలో

న్యూస్‌రీల్

నేడు సీఎం ట్రాన్సిట్ హాల్ట్



మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం విశాఖ రానున్నారు. ఆయన గన్నవరం నుంచి బయలుదేరి ఉదయం 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ నుంచి 9.30 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి బయలుదేరుతారు. తిరిగి మధ్యాహ్నం 3.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

ఏయూలో మాజీ ఉపరాష్ట్రపతి మార్నింగ్ వాక్



వర్సిటీలో మార్నింగ్ వాక్ చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఏయూక్యాంపస్: నగర పర్యటనలో ఉన్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు బుధవారం ఉదయం పోర్టు అతిథి గృహం నుంచి ఏయూ వరకు మార్నింగ్ వాక్ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు, ఏయూ గౌరవ ఆచార్యుడు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌తో పాటు పలువురు పూర్వ ఆచార్యులు, నగర ప్రముఖులు ఆయన వెంట నడిచారు. ఏయూ హిందీ విభాగానికి విచ్చేసిన మాజీ ఉప రాష్ట్రపతి గ్రంథాలయాన్ని సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ అల్పాహారాన్ని స్వీకరించారు.

రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా సంతోష్



నాగేంద్ర



సంతోష్ కుమార్

దొండపర్తి: రాష్ట్ర విద్యార్థి విభాగ కమిటీ ఉపాధ్యక్షుడిగా వాసుపల్లి సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీలో విశాఖకు చెందిన నలుగురికి ప్రాతినిధ్యం కల్పించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. జోనల్ ఇన్‌చార్జ్‌గా(విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా) జానకీరామ్ రెల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జి.నాగేంద్ర రావు, సంయుక్త కార్యదర్శిగా బి.నిషాకుమార్ నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన జి.వి.వి.భూషణం రాష్ట్ర కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా మాతే వెంకటరమణ నియమితులయ్యారు.

నేడు నావికాదళంలోకి తార్ముగ్లీ పునరాగమనం



ఐఎన్ఎస్ తార్ముగ్లీ

దొండపర్తి: తూర్పు నావికాదళంలోకి ఐఎన్ఎస్ తార్ముగ్లీ పునరాగమనం చేయనుంది. అత్యంత వేగంగా దాడి చేసే సామర్థ్యమున్న ఈ నౌక అత్యాధునిక సౌకర్యాలను అద్దుకొని మరింత శక్తివంతంగా విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో గురువారం జలప్రవేశం చేయనుంది. ఈ నౌక ఇప్పటికే రెండు దేశాల్లో మూడు పేర్లతో విశేష సేవలు అందించింది. భారత నావికాదళంలో ఐఎన్ఎస్ తిల్లాన్‌ఛాంగ్‌గా 2006 వరకు చురుకైన సేవలు అందించగా.. ఆ తరువాత హిందూ మహాసముద్ర ప్రాంతంలో దౌత్యపరమైన అంశాలపై భారత ప్రభుత్వం దాన్ని మాల్దీవుల జాతీయ రక్షణ దళానికి(ఎంఎన్‌డీఎఫ్) బహుమతిగా అందించింది. 2006, ఏప్రిల్ 16 నుంచి ఎంసీజీఎస్ హురావీగా ఎంఎన్‌డీఎఫ్‌లో చేరింది. ఈ ఏడాది మేలో అక్కడ సేవలను ఉపసంహరించుకుని తిరిగి భారత నావికాదళానికి చేరుకుంది. ఈ నౌకను పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో మరింత శక్తివంతంగా తయారు చేయాలని నౌకాదళం అధికారులు నిర్ణయించారు. ఆరు నెలలుగా విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో విస్తృత మరమ్మతులు, అత్యాధునిక సాంకేతికతను జత చేశారు. దీంతో ఈ పెట్రోలింగ్ నౌక గురువారం భారత నావికాదళంలోకి తిరిగి ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు చేశారు.

ఆటకు సై

- రేపటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



ట్రయల్ మ్యాచ్ ప్రారంభిస్తున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



బంతిని బలంగా బాదుతున్న మంత్రి అమర్‌నాథ్

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రంలోని యువతకు క్రీడల పట్ల అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా వార్డు స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 'ఆడుదాం ఆంధ్ర' అనే భారీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐదు స్థాయిల్లో జరిగే ఈ పోటీలకు శుక్రవారం నుంచి తెరలేవనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించనున్నారు. 15 ఏళ్లు నిండి.. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ తలపడే ఈ టోర్నీలో తొలి రెండు స్థాయిల్లో గ్రామ పంచాయతీ/వార్డు మొదలుకుని మండల స్థాయి వరకు ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ స్థాయిలో ఆడేందుకు పూర్తి స్థాయిలో నియమ నిబంధనలు తెలియక పోయినా.. ఆట స్వరూపం తెలిసి ఉంటే చాలు. ఇక పూర్తి నియమ నిబంధనలతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి.. ఈ మూడు స్థాయిల్లో సత్తా చాటిన వారికి భారీగా నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లతో పాటు గ్రామీణ క్రీడలైన ఖోఖో, కబడ్డీ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేత జట్లు జిల్లా స్థాయిలో, అక్కడ సత్తాచాటిన జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడడానికి అర్హత సాధిస్తాయి. ఇలా రాష్ట్రంలోని ప్రతీ గ్రామ జట్టు ఆడుతూ ముందుకు సాగిపోయే ఈ టోర్నీ ఫిబ్రవరి 3తో ముగియనుంది. ఇప్పటికే రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ప్రతీ గ్రామ పంచాయతీ/వార్డు జట్లకు కిట్లను అందజేసింది. అయితే ఈ టోర్నీలో పాల్గొనే ముందు.. పోటీలు ఎలా ఉంటాయో తెలుసుకుంటే విజయానికి మానసికంగా సంసిద్ధులు కావచ్చు. ఇంకెందుకు ఆలస్యం.. ఆట మొదలు పెట్టేద్దామా..!



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, చిత్రంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

ఎవరీ కిట్టూ?



ప్రతీ మెగా టోర్నీకి ప్రత్యేక చిహ్నం ఉంటుంది. దాన్నే మస్కట్ అంటారు. బ్లాక్‌బక్ (కృష్ణజింక) మన రాష్ట్ర జంతువు. దీన్నే ఇండియన్ యాంటీలోప్ అని కూడా పిలుస్తారు. చురుకుదనం, వేగం దీని ప్రత్యేకత. అందుకే ఆడుదాం ఆంధ్రకు కిట్టుగా పిలుచుకునే కృష్ణజింకే మస్కట్‌గా నిలిచింది.

వాలీబాల్ స్పైకింగ్




18 X 9 మీటర్ల విస్తీర్ణంలో దీర్ఘచతురస్రాకార కోర్టులో ఆట సాగుతుంది. భూమి నుంచి 2.43 మీటర్ల ఎత్తులో పురుషులకు, 2.24 మీటర్ల ఎత్తులో మహిళలకు నెట్ ఎత్తు ఉంటుంది. ఇదే కోర్టును రెండు భాగాలుగా చేస్తుంది. ఆటలో ఆరుగురు ఆడుతుంటే మరో ఆరుగురు స్టాండ్ బైగా ఉంటారు. బెస్ట్ ఆఫ్ త్రీగా సాగే మ్యాచ్‌లో రెండు పాయింట్ల తేడాతో సెట్ డిసైడ్ అవుతుంది. ఇక ఆటగాడు రెండు సార్లు బంతిని తాకితే ఫౌల్. జట్టు మూడో సారి తాకిన బంతి ప్రత్యర్థి కోర్టులోకి వెళ్లాలి. లేకుంటే పాయింట్ చేజారుతుంది.

క్రికెట్ ఇలా ఆడేద్దాం



పది ఓవర్ల ఇన్నింగ్స్‌తో మ్యాచ్ సాగుతుంది. 11 మంది ఆటగాళ్లతో పాటు ఐదుగురు సబ్‌స్టిట్యూట్స్ ఉంటారు. ఎదైనా మార్పు ఉంటే ప్రత్యర్థి జట్టు కెప్టెన్ ఒప్పుకుంటే మార్చుకోవచ్చు. టాస్‌తో లక్ష్యమా, ఛేదన అనేది నిర్ణయించుకుంటారు. అంపైర్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. మ్యాచ్ ప్రారంభానికి గంట ముందే మైదానంలో రిపోర్ట్ చేయాలి. గ్రామ పంచాయతీ/వార్డు, మండల స్థాయిల్లో హార్డ్ టెన్నిస్ బంతినే వినియోగిస్తారు. నియోజకవర్గ స్థాయి నుంచి నిబంధలన్నీ పక్కగా పాలో కావాలి.

ఖోఖో.. ఢీ..



12 మంది జట్టుగా ఉండే ఖోఖోలో 9 మంది 89 X 52 అడుగుల దీర్ఘచతురస్రాకార ఫీల్డ్‌లో ఆడతారు. టాస్ గెలిచి రన్నింగ్/ఛేజింగ్ ఎంచుకుంటారు. రన్నర్స్(డిఫెండర్స్) మూడు దఫాలుగా ముగ్గురు చొప్పున ఆటకు దిగుతారు. వీరిని ముట్టుకునేందుకు ప్రయత్నించే ఆటగాడు యాక్టివ్ ఛేజర్.. మిగిలిన 8 మంది కూర్చొని అవకాశం కోసం ఎగిరేందుకు సిద్ధపడే ఛేజర్లు. పోల్ డైవ్ ఈ ఆటలో అత్యంత ప్రతిభావంతమైన స్కిల్. ఐదు నిమిషాల వ్యవధితో సాగే ఆటలో రెండేసి ఇన్నింగ్స్ ఉంటాయి.

కూత పెడితే..



కబడ్డీ జట్టుకు 12 మంది ఆటగాళ్లు ఉంటారు. అయితే కూతకు దిగేది ఏడుగురే. పురుషులయితే 85 కేజీలు, మహిళలు అయితే 75 కేజీలలోపే ఉండాలి. 45 నిమిషాల పాటు సాగే ఆటలో 20 నిమిషాలు, 20 నిమిషాలు చొప్పున ఆడిస్తారు. మధ్యలో ఐదు నిమిషాలు బ్రేక్ ఉంటుంది. మహిళలకైతే 15 నిమిషాల చొప్పున ఆట సాగుతుంది. మధ్యలో ఐదు నిమిషాల పాటు బ్రేక్ ఇస్తారు. జట్టు ప్రత్యర్థి ఆటగాళ్లందరినీ ఔట్ చేస్తే అదనంగా రెండు పాయింట్లు(లూనా) వస్తాయి. కూతలో ప్రత్యర్థి జట్టు పూర్తిగా ఉన్నప్పుడు బోనస్ ఉంటుంది. నిర్ణీత సమయంలో పాయింట్లు సమమైతే చెరో ఐదు రైడ్లతో తిరిగి ఆట కొనసాగుతుంది. అప్పటికీ టై అయితే గోల్డెన్ రైడ్ అవకాశం ఇస్తారు.

'ఆడుదాం ఆంధ్రా' భారీ ర్యాలీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌కు మద్దతుగా బుధవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యంలో ఎన్ఏడీ జంక్షన్ నుంచి డీఎల్‌బీ క్వార్టర్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌కాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు.

ర్యాకెట్‌తో స్మాష్‌లు



13.40 పొడవు, 6.10 మీటర్ల వెడల్పుతో ఉండే కోర్టులో బ్యాడ్మింటన్ ఆడాల్సి ఉంటుంది. టాస్ వేసిన తర్వాత సర్వీస్ లేదా కోర్టు అనేది నిర్ణయించుకోవాలి. స్కోర్ 21 పాయింట్లతో బెస్ట్ ఆఫ్ త్రీగా సాగుతుంది. ఒక వేళ విజేతను నిర్ణయించేందుకు మూడో సెట్‌లో 11 పాయింట్ల వద్ద కోర్టు మార్పు ఉంటుంది. సర్వీస్‌ను నడుము పై భాగం నుంచే చేయాలి. అప్పుడు రాకెట్ షాఫ్ట్ కిందకు చూస్తున్నట్లు ఉండాలి.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గం	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ..15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ. 10 వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గం	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ. లక్ష
తృతీయ	రూ.5వేలు	రూ. 10 వేల	రూ.50 వేలు

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పునరాగమనం



కార్పొరేటర్ పి.వి.సురేష్‌కు పార్టీ కండువా వేస్తున్న రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

గోపాలపట్నం/మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ వైఎస్సార్ సీపీలోకి పునరాగమనం చేశారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు 89వ వార్డు సంతోష్‌నగర్‌కు చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో చిన్న చిన్న విభేధాలతో దూరమైన పి.వి.సురేష్ తిరిగి పార్టీలోకి చేరడం సంతోషంగా ఉందన్నారు. విబేధాలు వీడి పార్టీ కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు. పార్టీ పెద్దలతో మాట్లాడి సస్పెన్షన్ ఎత్తివేయిస్తానని చెప్పారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆనంద్ కుమార్‌కు అండగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తనని మళ్లీ పార్టీలోకి తీసుకోవడం సంతోషంగా ఉందని, పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటానని కార్పొరేటర్ సురేష్ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు



వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: వెనకబడిన సామాజిక వర్గానికి చెందిన తనను వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరుతో మాట్లాడుతూ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఎంతో మేలు జరిగిందన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌లు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, ఉత్తరాంధ్ర మంత్రులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

సాక్షి, విశాఖపట్నం : విద్యుత్ ఆదా చేసేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేలా గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా.మల్లికార్జున వెల్లడించారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ తన ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ విద్యుత్ పొదుపుపై ఇంటి నుంచే అవగాహన పెరగాలని ఆకాంక్షించారు. ఎస్ఈ మహేంద్రనాథ్ మాట్లాడుతూ ఇంధన పొదుపు అవగాహన ర్యాలీలను జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నామనీ, అదేవిధంగా స్వయం సహాయక మహిళా బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహోపకరణాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిప్తామని తెలిపారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో విద్యుత్ పొదుపు ఆవశ్యకత–నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై వర్క్‌షాప్స్ జరుపుతామని వెల్లడించారు. ఇంధన పొదుపుపై గ్రామీణ ప్రాంతాల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జానపద ప్రదర్శనలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఈఈ సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్

నేటి నుంచి ఆర్గానిక్ మేళా

- ఏయూ మైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహణ
- ప్రవేశం ఉచితం



వివరాలు వెల్లడిస్తున్న కుమార స్వామి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా గురువారం నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నట్లు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నిర్వాహకుడు కుమార స్వామి తెలిపారు. ఏయూ మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్గానిక్ మేళాను గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభిస్తారన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే మేళాలో 161 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, నేరుగా రైతులే తమ పంటలు, ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారన్నారు. మేళాలో భాగంగా 14న ప్రకృతి వ్యవసాయ రైతులతో సదస్సు, 15న గ్రాడ్యుయేట్ ఫార్మర్స్ వార్షిక సదస్సు, 16న ఆర్గానిక్ స్టోర్స్ ఛాంబర్ మీట్, 17న మిద్దెతోటలు నిర్వహిస్తున్న వారితో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రాంగణంలో ప్రత్యేకంగా సేంద్రియ ఉత్పత్తుల ఫుడ్ స్టాళ్లు, మిద్దె తోటలు, మొక్కల పెంపకంపై ఆసక్తి కలిగిన వారి కోసం నర్సరీ ఉంటాయన్నారు. ఆర్గానిక్ మేళాకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆరోగ్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫేకర్ లేవుట్‌లో పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం



ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధి ఫేకర్ లేఅవుట్‌లో పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్ ఏర్పాటుకు సంబంధించి ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం స్థల పరిశీలన చేశారు. లేఅవుట్‌లో రాయల్ గార్డెన్స్ అపార్టుమెంట్స్‌కు ఆనుకొని ఉన్న ఒక ఎకరా స్థలంలో పార్క్ ఏర్పాటుకు ఇది వరకే ప్రణాళికలు సిద్ధం చేశారని, అనివార్య కారణాల వల్ల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని కార్యనిర్వహణాధికారి పీవీవీ సత్యనారాయణరాజు కమిషనర్‌కు వివరించారు. పార్క్ ఏర్పాటుకు ముందుగా ఈ స్థలంలో రక్షణ గోడ నిర్మించాలని, పార్క్ నిర్మాణంలో స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతామని నివాసిత సంఘ సభ్యులు కమిషనర్‌ను కోరారు. అందుకు ఇప్పటికే రూ.20 లక్షల వరకు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రణాళిక రాగానే పార్క్ అభివృద్ధి చేసి, అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎస్ఈ రాజా, ఈఈ సంతోషి, ఏసీపీ వినయ్‌ప్రసాద్, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, పలువురు నివాసిత సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం

- కనకమహాలక్ష్మికి విశేషపూజలు
- అర్ధరాత్రి తొలి గురువారం పూజలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: బురుజుపేటలోని శ్రీకనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలకు బుధవారం ఉదయం 8.01 గంటలకు అంకురార్పణ జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలిపూజలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు బోదిలపాటి సత్యరూపవాణి, మళ్ల ధనలత, బుద్దల అనురాధ, బెహరా వెంకటరత్నం, సత్యవరపు సతీష్, వంకాయల మారుతీ ప్రసాద్, నండూరి సత్య శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం, సానబోయిన సురేష్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ సీహెచ్.వెంకటరమణ, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సహాయ ఇంజినీర్ కేఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కె.రామకృష్ణ చక్రవర్తి నాయుడు చేసిన భగవద్గీత పారాయణ భక్తులను ఆకట్టుకుంది.

వైభవంగా తొలి గురువారం పూజలు

కనకమహాలక్ష్మి సన్నిధిలో తొలి గురువారం పూజలు బుధవారం అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం అమ్మవారికి పసుపు పూశారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు స్వర్ణాభరణ అలంకరణలోనే భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచం తొడిగారు.

దర్శన క్యూలైన్లు ఇలా.. : టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూలైన్ల టికెట్లు అక్కడే ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్ పోస్టుతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచి నీటి సదుపాయం కల్పించారు. టౌన్ కొత్తరోడ్డు, ఘోషాస్పత్రి, అమ్మవారి ఆలయం వెనక భాగంలో చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

మార్గశిర గురువారాలు పురస్కరించుకొని అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నారు.

- జగదాంబ జంక్షన్ మీదుగా అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులు ఏవీఎన్ కాలేజ్ డౌన్ రోడ్డు నుంచి టౌన్ కొత్తరోడ్డు ముందు సందు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం చేరుకుని అక్కడే వాహనాలు పార్కు చేసి కాలి నడకన అమ్మవారి ఆలయానికి వెళ్లాలి.
- కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలు సీహార్స్ జంక్షన్ నుంచి టౌన్ కొత్తరోడ్డు ముందు పార్కింగ్ చేసుకుని కాలినడకన వెళ్లాలి.
- వన్‌టౌన్, ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా వచ్చే ద్విచక్ర వాహనదారులు లక్ష్మీటాకీస్, ఎంవీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకోవాలి.
- వన్‌టౌన్, ఓల్డ్ పోస్టాఫీస్ జంక్షన్ల మీదుగా అమ్మవారి ఆలయానికి వచ్చే నాలుగు చక్రాల వాహనదారులు కురుపాం మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- వీఐపీ టికెట్ హోల్డర్స్, రూ.500 టికెట్ తీసుకునే వారు బీచ్ రోడ్డు మీదుగా టౌన్ హాల్ చేరుకుని అక్కడే తమ వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- ఆలయ పరిసర ప్రాంతాల్లోని నివాసితులు తమ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేసి భక్తులకు అసౌకర్యం కలిగించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఆలయ పరిసర ప్రాంతాల వ్యాపారస్తులు రోడ్లపై ఎటువంటి వస్తువులు, వాహనాలు పెట్టి భక్తులకు అసౌకర్యం కల్గించకుండా సహకరించాలి.

క్లుప్తంగా

విశాఖ - కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: ఆంధ్రా ఊటీ అరకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకులకు శుభవార్త. విశాఖపట్నం - కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 25, 28న, తిరుగు ప్రయాణంలో కిరండూల్ - విశాఖపట్నం (08552)కు ఈ నెల 26, 29న మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మరింత మంది ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని అరకు అందాలను అద్దాల కోచ్‌ల నుంచి వీక్షించవచ్చన్నారు.

భువనేశ్వర్ – చెన్నై ఎక్స్‌ప్రెస్ ఆలస్యం

- ఈ నెల 14న గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్ – చెన్నై (12830) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటున్నర ఆలస్యంగా మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరుతుందని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ జాబితా

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్, గ్రూప్ డీ అటెండర్ ఉద్యోగాలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో మెరిట్ విధానంలో భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజనల్ జాబితాను www.visakhapatnam.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 20వ తేదీలోగా తమ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. పారదర్శకంగా, ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా భర్తీ చేస్తామన్నారు.

ఐరన్ మ్యాన్ పతక విజేత కృష్ణకు అభినందన

దొండపర్తి : ఐరన్ మ్యాన్ పోటీల్లో పతకం సాధించిన నగర పోలీస్ శాఖకు చెందిన కానిస్టేబుల్ పరవాడ కృష్ణను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించారు. ఇప్పటికే రెండు సార్లు భారత్ తరపున పోటీ చేసి టైటిల్ విజేతగా నిలిచారు. తాజాగా ఈ నెల 3వ తేదీన ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ ఐరన్ మ్యాన్ ట్రయథ్లాన్ పోటీల్లో విజయవంతంగా 13.13 గంటలు పూర్తి చేసి మూడోసారి ఐరన్ మ్యాన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పరవాడ కృష్ణను బుధవారం సీపీ అభినందిస్తూ అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొంటూ మూడోసారి ఐరన్ మ్యాన్ టైటిల్ విజేతగా నిలవడం గొప్ప విషయమన్నారు.



కాంతులీనిన పుష్కరిణి

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి బుధవారం పోలిపాడ్యమి శోభను సంతరించుకుంది. కార్తీక మాసానికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు తెల్లవారుజామున రెండు గంటల నుంచే పలు ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు, భక్తులు పెద్ద ఎత్తున పుష్కరిణి వద్దకు తరలివచ్చారు. దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో వాటిని నీటిలో విడిచిపెట్టారు. కార్తీక దామోదరా.. నమో నమః అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించారు. పుష్కరిణి వద్ద ఉన్న రావి, మర్రి చెట్లు, తులసికోట వద్ద దీపారాధన చేశారు. బ్రాహ్మణులకు సాలిగ్రామ దానాలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి అంతా కిక్కిరిసింది. అడవివరం మార్కెట్ కూడలి నుంచి పుష్కరిణికి వెళ్లే మార్గమంతా తీవ్ర రద్దీగా మారింది. పుష్కరిణి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లు, సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచారు. గోపాలపట్నం సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు భక్తుల రద్దీని నియంత్రించారు.



కార్తీక దామోదరా.. నమో నమః

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు సేవలందించాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

మహారాణిపేట: వైద్యులు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు సేవలందించాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. విశాఖలో 83వ వార్షిక కాన్ఫరెన్స్ ఆఫ్ ది అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. రుషికొండ సాయిప్రియ బీచ్ రిసార్ట్‌లో జరిగిన కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు మెరుగైన సేవలందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు పి.రఘురామ్, కె.పట్టాభిరామయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటు అవార్డులను వెంకయ్యనాయుడు అందజేశారు. అలాగే ఏడుగురు ప్రపంచ ప్రఖ్యాత సర్జన్లకు ఏఎస్ఐ గౌరవ ఫెలోషిప్‌ను ప్రధానం చేశారు. వార్షిక కాన్ఫరెన్స్ ఆఫ్ ది అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా మొట్టమొదటిసారిగా విశాఖలో నిర్వహించడం సంతోషంగా ఉందని అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ శాంతారావు తెలిపారు. సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రఖ్యాత సర్జన్లతో పాటు దేశం నలుమూలల నుంచి ఆరువేల మందికి పైగా సర్జన్లు, సర్జికల్ ట్రైనీలు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డాక్టర్ పీవీ రమణమూర్తి , ఏఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ జైన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, కార్యదర్శి డాక్టర్ సంతోష్ జాన్ అబ్రహం పాల్గొన్నారు.

ఉత్తర కోస్తాలో కిడ్నీ వ్యాధుల అధికం



డాక్టర్ రవిరాజు

మహారాణిపేట: ఉత్తర కోస్తాలో ఉన్న వాతావరణ పరిస్థితులు కారణంగా కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్నాయని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు తాతపూడి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో నిర్మించిన కిడ్నీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో డాక్టర్ రవిరాజును ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధులపై తన పరిశోధనలను బుధవారం నగరంలో మీడియాకు విడుదల చేశారు. ప్రపంచంలో 10 శాతం జనాభా క్రానిక్ కిడ్నీ వ్యాధి బారిన పడుతోందని, 21వ శతాబ్దంలో అనారోగ్యం, మరణాలలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటోందని తెలిపారు. కొత్తగా ఉద్భవించిన దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ప్రపంచ వ్యాప్యంగా వేలాది మంది ప్రాణాలను బలితీసుకుందని వెల్లడించారు. 1990వ దశకం చివరి నుంచి కేజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగానికి అత్యధిక శాతం మంది రోగులు ఉద్దానం నుంచే వస్తున్నారని వివరించారు. దీంతో ఉద్దానంలో సీకేడీ ప్రాబల్యంపై అధ్యయనం చేసినట్లు చెప్పారు. స్థానిక ప్రజల సహకారంతో ఉత్తర కోస్తాలోని శ్రీకాకుళం మండలాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి రక్త, మూత్ర నమూనాలను సేకరించి విశ్లేషణ చేశామన్నారు. దాదాపు 25–30శాతం రక్త నమూనాలలో క్రియాటినిన్ స్థాయిలు ఎక్కువగా ఉన్నాయని, పెద్ద సంఖ్యలో మూత్ర నమూనాలు ముఖ్యమైన ప్రోటీన్‌ను కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉత్తర మండలాల్లో మరిన్ని వైద్య శిబిరాలు, ఉద్దానం మండలాల్లో సీకేడీ ప్రబలంగా ఉన్నట్లు గుర్తించి అప్పట్లో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు డాక్టర్ రవిరాజు తెలిపారు.

విద్యార్థులకు శిక్షణతో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

భీమునిపట్నం: విద్యార్థులకు క్రీడలు, ఆటల్లో వ్యాయామ ఉపాధ్యాయులు మంచి శిక్షణ అందించాలని విశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి సూచించారు. స్థానిక సెడార్ పాఠశాలలో రాష్ట్ర విద్య శిక్షణ పరిశోధన మండలి ఆధ్వర్యంలో 8 జిల్లాలకు చెందిన 130 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు (పీఈటీ) బుధవారం నిర్వహించిన సంకల్పం శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, ఆటలు ఎంతో ముఖ్యమైనవని, వ్యాయామం కోసమే కాకుండా అన్ని పోటీల్లోనూ పాల్గొనే అవకాశాలు ఉంటాయన్నారు. ఇది వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వారు అన్ని క్రీడల్లోనూ చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఇక్కడ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని కోరారు. మానిటరింగ్ అధికారి లక్ష్మి, సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రజిని రాక

మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని గురువారం విశాఖ రానున్నారు. గన్నవరం నుంచి సీఎం వైఎస్ జగన్‌తో కలిసి ఉదయం 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. 9.20 గంటల నుంచి 3.35 గంటల వరకు సీఎం వైఎస్ జగన్ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి సీఎంతో కలిసి ఆమె గన్నవరం వెళ్లనున్నారు.

ఆక్రమిత ప్రభుత్వ భూముల పరిశీలన



మిథిలాపురి వుడా కాలనీలో మ్యాప్, రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి

మధురవాడ: కోట్లాది రూపాయలు విలువ చేసే 24 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో గతంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల గుర్తింపు, ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం మిథిలాపురి వుడా కాలనీ, వికలాంగుల కాలనీ పరిసర ప్రాంతాల్లో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఆక్రమణకు గురైన, అసైన్‌మెంట్ రద్దు చేసిన తర్వాత కూడా సదరు వ్యక్తులు అదే భూమిలో ఉండడం, ఒకరికి భూమి కేటాయిస్తే వేరే వ్యక్తులు అక్కడ ఉండడాన్ని పరిశీలించారు. అలాగే కొందరు అసైన్డ్ భూములు కొనుగోలు చేసి, అందులో ఉంటున్నట్టు గుర్తించారు. మరికొందరు ప్రభుత్వ భూముల్లో చిన్న చిన్న షెడ్లు వేసుకుని నివసిస్తూ... ఆ స్థల హక్కుల కోసం కోర్టులను ఆశ్రయించిన సంఘటనలు కూడా ఉన్నట్టు గుర్తించారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు. 294/2లోని సుమారు 4 ఎకరాలు, 350/2లో 10 ఎకరాలు, 350, 351లోని సబ్ డివిజన్లలో 10 ఎకరాలు, 294/2లోని భూమి అమ్మకాలు జరిగినట్టు నిర్ధారణకు వచ్చామని చెప్పారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు చేపడతామన్నారు. ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ రమణబాబు, వీఆర్వో సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికను బెదిరించిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

విశాఖ లీగల్: బాలికపై అనుచిత వ్యాఖ్యలు చేసి బెదిరించి భయాందోళనకు గురిచేసిన యువకునికి రెండు కేసుల్లో నాలుగేళ్ల జైలు, రూ.4000 జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాధితురాలు తండ్రి నగరంలోని నాల్గవ పట్టణ పోలీస్ పరిధిలో దొండపర్తిలోని ఒక అపార్టుమెంటులో పనిచేసేవాడు. బాధితురాలు స్థానిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుకుండేది. నిందితుడు పెదగాడి సతీష్(20) సేల్స్‌బాయ్‌గా ఇంటింటికి తిరిగి వస్తువులు విక్రయిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో అపార్టుమెంట్ దగ్గర సెల్లార్‌లో బాలికను చూశాడు. తనతో సినిమాకు, పార్కులకు రావాలని అడిగాడు. తాను చాలాసార్లు జైలుకు వెళ్లి వచ్చానని తనతో రాకపోతే చంపేస్తానని భయపెట్టేవాడు. ఈ విషయాన్ని బాలిక తండ్రికి చెప్పగా అతడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నిందితుడు సతీష్ కొంతకాలం తర్వాత 2016 జూన్ 28న మళ్లీ బాలికను బెదిరించాడు. దీంతో ఫోర్త్ టౌన్ పోలీసులు మరో కేసు పెట్టారు. రెండు కేసుల్లో శిక్ష ఖరారు కావడంతో న్యాయమూర్తి ప్రతి కేసులను రెండేళ్ల చొప్పున నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అలాగే బాలికకు రాష్ట్ర ప్రభుత్వం 50,000 పరిహారం ఇవ్వాలని కూడా న్యాయమూర్తి ఆదేశించారు.

విశాఖకు అదనంగా 15 ఎంజీడీల నీటి తరలింపు

- కాలువల అభివృద్ధికి రూ.600 కోట్లతో ప్రతిపాదనలు
- అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభం
- విస్కో జీఎం, జీవీఎంసీ ఈఈ చిరంజీవి వెల్లడి



నాతవరం మండలంలో పర్యటిస్తున్న విస్కో జీఎం, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, డీఈ కామేశ్వరరావు

నాతవరం: ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి విశాఖకు రోజుకు అదనంగా 15 ఎంజీడీల నీటిని తరలించేందుకు ప్రతిపాదనలు పంపించామని విస్కో జనరల్ మేనేజరు, జీవీఎంసీ ఈఈ చిరంజీవి చెప్పారు. ఆయన నాతవరం మండలంలో పలు ప్రాంతాల్లో తుపానుకు దెబ్బతిన్న ఏలేరు కాలువను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం రోజుకు 90 ఎంజీడీల నీటిని నగరానికి తరలిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విశాఖలోని ముడసర్లోవ, మధురవాడ ప్రాంతాలకు అదనంగా 15 ఎంజీడీల నీటిని తరలించేందుకు రూ.600 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కాలువలో పూడికలను తొలగించి, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విస్కో డీఈ కామేశ్వరరావు, జేఈ నానాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.60 లక్షల పరిహారం

- చెల్లింపునకు బీమా కంపెనీ అంగీకారం
- లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం

డాబాగార్డెన్స్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.60 లక్షల నష్టపరిహారం చెల్లించడానికి బీమా కంపెనీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఈ నెల 9న జరిగిన లోక్ అదాలత్‌లో గాజువాక 13వ అదనపు జిల్లా న్యాయవాది సమక్షంలో ఓరియంటల్ ఇన్సూరెన్స్ అధికారులు, బాధిత కుటుంబ సభ్యుల మధ్య ఒప్పందం కుదిరింది. ఓరియంటల్ ఇన్సూరెన్స్ ఇన్‌చార్జ్ మేనేజర్ ఐవీ శ్రీధర్ తెలిపిన వివరాలివి.. ఏపీ ట్రాన్స్‌కోలో కాపలాదారుడిగా పని చేస్తున్న మసూద్ మహ్మద్ 2020 మార్చి 11న లారీ ఢీకొనడంతో మృతి చెందారు. ఈ కేసులో లారీ యజమానిని, బీమా కంపెనీని ప్రతివాదులుగా పేర్కొంటూ కుటుంబ సభ్యులు రూ.85 లక్షల నష్టపరిహారం కోరారు. బీమా కంపెనీ బాధిత కుటుంబానికి రూ.60 లక్షలు చెల్లించడానికి ముందుకు రాగా, ఆ నష్టపరిహారం చెల్లించేలా జిల్లా 13వ అదనపు న్యాయమూర్తి సమక్షంలో జాతీయ లోక్ అదాలత్‌లో ఒప్పందం కుదిరిందని వివరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆ తీర్పులో స్పష్టం చేశారు. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ఎస్.శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ప్రభాకర్ శ్యామలాల్ ఛత్తీస్‌గఢ్ ప్రాంత నివాసి. వృత్తి రీత్యా అంబులెన్స్ డ్రైవర్. 2019 ఫిబ్రవరి 22న శ్యామ్‌లాల్ సీలేరు నుంచి విశాఖ, పెందుర్తి మీదుగా ఛత్తీస్‌ఘడ్ ప్రాంతానికి అంబులెన్స్ ద్వారా 2వేల కేజీల గంజాయి తరలిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. ఆ సమాచారం మేరకు అధికారులు తెల్లవారుజామున పెందుర్తి సమీపంలో నిఘా పెట్టగా ఏపీ 31 టీయూ 1375 అంబులెన్స్ ద్వారా 1,813 కేజీల గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితునిపై పెందుర్తి పోలీసుల ద్వారా కేసు నమోదు చేయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

కేంద్ర మంత్రి రాక రేపు

మహారాణిపేట: కేంద్ర సోషల్ జస్టిస్, సాధికారత శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి శుక్రవారం విశాఖ రానున్నారు. బెంగళూరు నుంచి సాయంత్రం 5.55 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 16న అనకాపల్లిలో పలు పథకాల కింద ఎయిడ్స్ పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో బెంగళూరుకు తిరుగు పయనం అవుతారు.